# ప్రకటన గ్రంథము 17వ అధ్యాయము

## మహావేశ్య యొక్కయు, క్రూరమృగము యొక్కయు దర్శనము

ఆ ఏడు పాత్రలను పట్టుకొనియున్న ఏడుగురు దేవదూతలలో ఒకడు వచ్చి నాతో మాటలాడుచు
ఈలాగు చెప్పెను – నీవిక్కడికి రమ్ము, విస్తార జలముల మీద కూర్చున్న మహావేశ్యకు చేయబడు తీర్పు నీకు
కనుపరచెదను. 2 భూరాజులు ఆమెతో వ్యభిచరించిరి, భూనివాసులు ఆమె వ్యభిచార మద్యములో మత్తులైరి.
3 అప్పుడతడు ఆత్మవశుడనైన నన్ను అరణ్యమునకు కొనిపోగా, దేవదూషణ నామములతో నిండుకొని, ఏడు
తలలును పది కొమ్ములును గల ఎఱ్ఱని మృగము మీద కూర్చుండిన ఒక స్త్రీని చూచితిని. 4 ఆ స్త్రీ ధూమ్ర
రక్తవర్ణముగల వస్త్రము ధరించుకొని, బంగారముతోను రత్నములతోను ముత్యములతోను అలంకరింప
బడినదై, ఏహ్యమైన కార్యములతోను తాను చేయుచున్న వ్యభిచార సంబంధమైన అపవిత్రకార్యములతోను
నిండిన యొక సువర్ణపాత్రను తనచేత పట్టుకొనియుండెను. 5 దాని నొసట దాని పేరు ఈలాగు వ్రాయబడి
యుండెను – మర్మము, వేశ్యలకును భూమిలోని ఏహ్యమైన వాటికిని తల్లియైన మహాబబులోను. 6 మరియు
ఆ స్త్రీ పరిశుద్ధుల రక్తముచేతను, యేసుయొక్క హతసాక్షుల రక్తముచేతను మత్తిల్లి యుండుట చూచితిని. నేను
దాని చూచి బహుగా ఆశ్చర్యపడగా,

7 ఆ దూత నాతో ఇట్లనెను – నీవేల ఆశ్చర్యపడితివి ? ఈ స్త్రీని గూర్చిన మర్మమును, ఏడు
తలలును పది కొమ్ములును కలిగి దాని మోయుచున్న కౄరమృగమును గూర్చిన మర్మమును నేను నీకు
తెలిపెదను. 8 నీవు చూచిన ఆ మృగము ఉండెను గాని ఇప్పుడు లేదు అయితే అది అగాధజలములో నుండి
పైకి వచ్చుటకును నాశనమునకు పోవుటకును సిద్ధముగా ఉన్నది. భూనివాసులలో జగదుత్పత్తి మొదలుకొని
జీవగ్రంథమందు ఎవరి పేరు వ్రాయబడలేదో వారు, ఆ మృగముండెను గాని ఇప్పుడు లేదు అయితే
ముందుకు వచ్చునన్న సంగతి తెలిసికొని ఆశ్చర్యపడుదురు. 9 ఇందులో జ్ఞానముగల మనస్సు కనబడును. ఆ
ఏడు తలలు ఆ స్త్రీ కూర్చున్న ఏడు కొండలు 10 మరియు ఏడుగురు రాజులు కలరు అయిదుగురు
కూలిపోయిరి, ఒకడున్నాడు, కడమ వాడు ఇంకను రాలేదు, వచ్చినప్పుడు అతడు కొంచెము
కాలముండవలెను. 11 ఉండినదియు ఇప్పుడు లేనిదియునైన ఈ కౄరమృగము ఆ ఏడుగురితో పాటు
ఒకడునైయుండియు తానే ఎనిమిదవ రాజగుచు నాశనమునకు పోవును. 12 నీవు చూచిన ఆ పది కొమ్ములు
పదిమంది రాజులు. వారిదివరకు రాజ్యమును పొందలేదు గాని యొకగడియ కౄరమృగముతో కూడ
రాజులవలె అధికారము పొందుదురు. 13 వీరు ఏకాభిప్రాయము గలవారై తమ బలమును అధికారమును ఆ
మృగమునకు అప్పగింతురు. 14 వీరు గొఱ్ఱెపిల్లతో యుద్ధము చేతురు గాని, గొఱ్ఱెపిల్ల ప్రభువులకు ప్రభువును
రాజులకు రాజునై యున్నందునను, తనతో కూడ ఉండినవారు పిలువబడినవారై, ఏర్పరచబడినవారై,
నమ్మకమైనవారై యున్నందునను, ఆయన ఆ రాజులను జయించును. 15 మరియు ఆ దూత నాతో ఈలాగు
చెప్పెను – ఆ వేశ్య కూర్చున్న చోట నీవు చూచిన జలములు ప్రజలను, జన సమూహములను, జనములను,
ఆయా భాషలు మాటలాడువారిని సూచించును. 16 నీవు ఆ పది కొమ్ములుగల ఆ మృగమును చూచితివే,
వారు ఆ వేశ్యను ద్వేషించి, దానిని దిక్కులేని దాని గాను దిగంబరిగాను చేసి, దాని మాంసము భక్షించి
అగ్నిచేత దానిని బొత్తిగా కాల్చివేతురు. 17 దేవుని మాటలు నెరవేరువరకు వారు ఏకాభిప్రాయము గలవారై

తమ రాజ్యమును ఆ మృగమునకు అప్పగించుటవలన  తన సంకల్పము కొనసాగించునట్లు దేవుడు వారికి బుద్ధి పుట్టించెను. 18 మరియు నీవు చూచిన ఆ స్త్రీ భూరాజులు నేలు ఆ మహాపట్టణమే.